# చేతి వ్రేళ్ల చిన్నికుటుంబము!

రాయసం వెంకటశివుడుగారు

చిన్ననాఁడు నేస్తులు నేనును ఆడని యాటలు, చెప్పుకొనని కథలును లేనెలేవు. వాక్కులేని పశువులు, చలనము లేని చెట్లును మా క్రీడలలోఁ బాల్గొనుచుండునట్లు భ్రమించుచుండువారము! అపుడె ధార్వాడనాటక సమాజ మాంధ్రదేశమునఁ బ్రదర్శించిన నాటకములు చూచియుండిన మా పెద్దయన్న సెలవుల కింటికి వచ్చినపుడు, మా క్రీడావినోదములు పెచ్చుపెరుగుచుండెడివి.

ఒకనాఁ డాటలనడుమ సలపు తీర్చుకొనుచు, చేతులుచాచి మా పెద్దచింతచెట్టు క్రింద మేము కూర్చుంటిమి వరుసగనుండు మా చేతుల వ్రేళ్లు సంజకెంజాయలో మెరసిపోవుచుండెను. వానిలో నిడుదలు కురుచలు, లావులు సన్నములు, రకరకములుండెను. కొందఱిగోళ్లు తెల్లగను, కొన్ని గోరింటాకు రంగుతో నెఱ్ఱగను మెరయుచుండెను. అంతట మాలో నొక బాలకుఁడు, "చూచారా! మనవలెనే మన చేతివేళ్లుకూడా ఎపుడైనా పండుగలకు ఆటలాడుకొంటవేమో సుమీ!" యని పలికెను. ఆతని యూహకు నవ్వుకొంటిమి.

ఇంతకంటెను అద్భుతము గొలిపినవి యిపుడు మాయన్న పలికిన పలుకులు: "పిల్లలారా! మీ చేతులిపుడు పరిశోధించుకొండి. ఒక్కొక చేతివేళ్లు ఒక చిన్నకుటుంబమే సుమండీ! ఇంతేకాదు—ఆ వేళ్లచేత నేను మాట్లాడిస్తా కూడాను—చూచుకొండి!" చేతిలో మణగియున్న వ్రేళ్లెట్లు లేచి మాట్లాడునాయని పిల్లలము పుల్కుపుల్కునఁ జూచుచుంటిమి!

మా యన్న యపు డిట్లనెను:—"పిల్లలారా! ఇపుడు మనము 'వేళ్లాట' ఆడుకొందాము. వేళ్ళన్నీ ఒక కుటుంబమన్నాను. కుటుంబములో తలిదండ్రులు, కుమాళ్లు కూతుళ్లును ఉంటారని మీకు తెలుసును. మీలో యెవరే వేలు వేషము వేస్తారో బాగా ఆలోచించుకోండి!" ఈమాటలు వినఁగనే, మాలో గొప్పయలజడి గలిగెను. అందఱును తలాయొక వేషమును వేయుట కాలోచించుకొంటిమి. మాయన్న యంతట నెలుగెత్తి యిట్లనెను:—"కుటుంబానికి తల్లిముఖ్యం—ఆ తల్లివేలు వేషం మీలో యెవరు వేస్తారో చెప్పండి!"

ఈపాత్రను ధరించుటకు మాలో నిద్దఱము పూనుకొంటిమి,—నేను, సుందరియును. "ఏదీ, మీరే వేలును తల్లివేలని పట్టినారో చూపించండి!" అని యన్న యడుగఁగా, బొటనవ్రేలు నేనును, నడిమి వ్రేలు సుందరియును, జూపితిమి. అంత మాకీ సంవాదము జరిగెను.

అన్న:—"బొటనవేలూ! నీవు తల్లివేలు ఎలాగైనావో చెప్పు?"

బొటనవేలు:—"వేళ్లన్నిటిలోను లావుగాను, బలముగాను ఉన్నాను గనుక!"

అన్న:—"మధ్యవేలూ! నీవు అమ్మ వెట్లయినావు?"

## చేతివ్రేళ్ల చిన్నికుటుంబము !

నడిమివ్రేలు:—"అన్నిటిలోను పొడుగుగాను, మధ్యగానుఉన్నాను-నేనే తల్లివేలును."

అంతట మాపిల్లవాండ్రలో కలవరము బయలుదేరెను. కొందఱు నాపక్షమున నుండిరి. కొందఱు సుందరియె తల్లివ్రేలుగా నుండఁదగినదని తలంచిరి.

సద్దు నివారించి మధ్యవర్తియైన మా యన్న యిట్లు పలికెను. "వేషంవేసినది మగవాడైనా ఆడదైనా వకటె! మనకు కావలసినది అసలు పాత్రే. ఇది తేలడం కష్టమైతే యింకొకప్రశ్న వేస్తాను. తండ్రివేలువేషము వేసేవా రెవరో చెప్పండి?'

బాగుగ నాలోచించుకొన్నిన నేనులేచి, "నేనే తండ్రివేలును!" అని చెప్పివేసితిని. అందఱును నవ్విరి.

అన్న:—"అబ్బాయీ! నీవు తల్లివి తండ్రివికూడా యేలాగవుతావు? నీవు తండ్రి వెట్లో చెప్పు!"

నేను:—"అన్నివేళ్ళలోను ధృడము గాను, ముఖ్యముగాను ఉన్న బొటనవేలును గనుక నేనే తండ్రిని—మధ్యవేలు అందరిలోను పొడుగైనను, అంత శక్తిలేనిది గనుక, అది తల్లివేలె."

ఈనిర్ధారణమున కందఱు సులభముగ సమ్మతించిరి. అపుడు తరువాతి ప్రశ్నమువచ్చెను.

అన్న:—"చూపుడువేలు వేషం మెవరిదోయి?"

నాచెలికాండ్రలో రంగయ్య మిగుల బలిష్ఠుఁడు, సాహసుఁడును. అతఁ డిపుడు వచ్చి ముందునిలిచెను.

అన్న:—"ఏమోయి తర్జనీ! నీవృత్తాంతము చెప్పు—నీవు మగపిల్లవాడవా, ఆడపిల్లవా? కారణాలేమిటి?"

తర్జని:—"నేను మగపిల్లవాడను. అన్నివేళ్లను, తుదకు తండ్రివేలినికూడా, ధిక్కరించే శక్తి నాకున్నది." ఇదియు నందఱు నొప్పుకొనిరి.

అన్న:—"ఇపుడు నాలుగవవేలు కథ మనము విందాము."

అపుడు రమణయ్య ముందుకురాఁగా, "నీ వెవరవు?" అని మధ్యవర్తి ప్రశ్నించెను.

నాలుగవవేలు:—"నేను అనామికమను ఆడుపిల్లను - అక్కయ్యను!" అని పలికినపు డందఱును ప్రక్కలు పగులునట్టుగ నవ్విరి. ఆమాటలలోని సత్యముమాత్ర మెవరును గాని, శంకింపలేదు.

ఓపికలేని మాకడఁగొట్టు చెల్లెలు, చిట్టియంతట ముందుకువచ్చి, "నేను చిటికినివేలిని! చిన్నక్కయ్యను!" అనుదాని ముద్దుమాటల కెల్లరును నవ్వి, ముద్దులలో దానిని ముంచివైచిరి!

తర్జని తన ప్రతాప మింకను ప్రదర్శింపఁగోరి, మరల ముందుకువచ్చి, "నేను తల్లి పక్కవారి కందరికీ అండగా వుండడమేకాక, తండ్రికి సదా సాయపడుచుంటేనే గాని, ఆత డేమీచేయలేడు!" అని విఱ్ఱవీగెను!

ఒక విధమగు గర్వము చిట్టికిఁగూడ లేకపోలేదు — ఇపుడామె ముందడుగిడి, "ఇంటిపనంతా పెద్దవాళ్లు చేసుకుని, చిన్నపిల్లనని నన్ను ఆట్లాడుకోనిస్తారు — నన్నెవరూ కొట్టరుకో!" అని తన చిన్నవేలాడించుచు నట్టె పరుగెత్తెను.